## క్లుప్తంగా

### దరఖాస్తుల ఆహ్వానం

డోర్నకల్ : మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలంటూ ఆ పాఠశాల ఉపాధ్యాయులు గురువారం ప్రచారం నిర్వహించారు. గొల్లచర్ల, కస్నాతండాలలో విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి స్కూల్ ప్రత్యేకత గురించి వివరించారు. అనంతరం సమ్మక్క, సారలమ్మతల్లి ఆలయం వద్ద భక్తులకు కరపత్రాలను పంపిణీ చేశారు.

### డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



నెహ్రూసెంటర్ : మహబూబాబాద్ ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న హైర్ బస్సు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు అన్నారు. అద్దె బస్సుల డ్రైవర్లు చేపట్టిన సమ్మె గురువారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా డ్రైవర్ల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు చందు, శ్రావణ్, నాయకులు రవీందర్, వెంకటేష్, శ్రీశైలం, ఐలయ్య పాల్గొన్నారు.

### వివాహిత ఆత్మహత్యాయత్నం

గార్ల: పురుగుల మందు సేవించి ఓ వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం మర్రిగూడెంలో చోటుచేసుకుంది. మర్రిగూడెం గ్రామానికి చెందిన భూక్యా కౌసల్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు సేవించింది. ఇంట్లో పిల్లలు గమనించి ఇరుగుపొరుగు వారికి సమాచారం ఇవ్వడంతో ఆమెను హుటాహుటిన గార్ల సీహెచ్‌సీ ఆసుపత్రికి తరలించగా డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్ ఆమెకు చికిత్స చేస్తున్నట్లు తెలిపారు. కుటుంబ కలహాలే ఆత్మహత్యాయత్నానికి కారణమని తెలుస్తోంది.

### క్యాలెండర్ ఆవిష్కరణ

గార్ల : న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆ పార్టీ జిల్లా నాయకుడు జి.సక్రు గురువారం మండలకేంద్రంలో ఆవిష్కరించారు. సీహెచ్ గణేష్, ఎస్ మనోహర్, ఎం మాన్యా, వీరభద్రం,మంగీలాల్, వెంకటేశ్వర్లు, సర్వయ్య, మంక్తియా, పూర్ణాచారి, పాల్గొన్నారు.

### నేత్రదానం

దంతాలపల్లి: మండలం బొడ్లాడలో మొదటి అంగన్‌వాడీ కేంద్రంలో ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్న కలువల వినోద అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుమారుడు తపస్వి ఆమె నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు.

### క్రీడాప్రాంగణాన్ని తొలగించాలి

బయ్యారం : మండలంలోని జగ్గుతండా ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పంచాయతీ క్రీడాప్రాంగణాన్ని తొలగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాగం లోకేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన ఆందోళన కార్యక్రమాన్నినుద్దేశించి ఆయన మాట్లాడారు. స్కూల్‌లో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేయటం వలన విద్యార్థుల చదువులకు ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. ఉదయ్, గణేష్, ప్రవళిక, స్వాతి, వెన్నెల, క్రాంతి పాల్గొన్నారు.

### సమావేశం వాయిదా

కేసముద్రం: స్థానిక రైతువేదిక భవనంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడినట్లు ఎంపీడీఓ తెలిపారు. సమావేశానికి అధికారులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు హాజరుకాగా, అధికారపార్టీ ఎంపీటీసీలు మాత్రం సభకు హాజరుకాలేదు. అయితే నిధుల మంజూరు విషయంలో అంతర్గతంగా ఏర్పడిన వివాదం కారణంగా అధికార పార్టీకి చెందిన పలువురు ఎంపీటీసీలు సభకు హాజరుకాలేదని తెలుస్తుంది. తాము గ్రామాల్లో ఉన్న సమస్యలపై సభలో ప్రశ్నిస్తామని తెలిసే, అధికారపార్టీ ఎంపీటీసీలను రానివ్వకుండా చేశారంటూ కాంగ్రెస్‌కు చెందిన సర్పంచులు ముదిగిరి సాంబయ్య, గుగులోతు వెంకన్న, ఎంపీటీసీ క్రిష్టమూర్తి ఆరోపించారు.

### అసెంబ్లీలో తీర్మానం చేయాలి

గార్ల : తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేస్తూ తీర్మానం చేయాలని పీడీఎస్‌యూ మండల ప్రధాన కార్యదర్శి ఎం.మహేష్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జూనియర్ కళాశాలలో జరిగిన సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

### మెస్ చార్జీలు పెంచాలి

కురవి : హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలను పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పట్ల మధు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని నేరడలోని మోడల్ స్కూల్ హాస్టల్‌ను సందర్శించి బాలికలతో మాట్లాడారు. నిత్యావసర ధరలు పెరుగుతున్నాయని, వాటికి అనుగుణంగా మెస్‌చార్జీలు పెంచాలన్నారు. కార్యక్రమంలో గంధసిరి జ్యోతిబసు, కొలిపాక వీరేందర్, మహేష్, ప్రవీష్, సంతోష్ పాల్గొన్నారు.

# విద్యకు కులమతాలు అడ్డుకాదు

- ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్



పాఠశాలలో నూతన బల్లాలు, గ్రీన్ బోర్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

నెల్లికుదురు : విద్యకు కుల మతాలు, పేదరికం అడ్డు కాకూడదనే ఉద్దేశ్యంతోనే కేసీఆర్ ప్రభుత్వం మన ఊరు–మన బడి పథకంలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మన ఊరు–మన బడి పథకం మొదటి విడతలో అభివృద్ధి చేసిన పాఠశాలను గురువారం స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. పిల్లలకోసం ఏర్పాటు చేసిన గ్రీన్ బోర్డులు, బల్లలు, టాయిలెట్స్, వాటర్ సరఫరా, పాఠశాలకు వేసిన పేయింట్స్‌ను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బీరవెల్లి యాదగిరిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక్కో క్లాస్‌రూంలో 60 మంది పైనే విద్యార్థులను కూర్చోబెట్టి చదువు చెప్పే కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని అన్నారు. ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, జెడ్పీటీసీ సభ్యుడు మేకపోతు శ్రీనివాసరెడ్డి, మండల ప్రత్యేక అధికారి సూర్యనారాయణ, డీఈ రామారావు, తహసీల్దార్ యోగేశ్వరరావు, ఎంపీడీఓ శేశాద్రి, ఎంఈఓ గుగులోతు రాము, ఎంపీటీసీ వాణి, హెచ్‌ఎం ఇంద్రసేనారెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ మానేందర్ పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమానికి పాటుపడాలి

- డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

మరిపెడ/మరిపెడ రూరల్: ప్రజా సంక్షేమం కోసం అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. ఎంపీడీఓ సమావేశ హాల్‌లో ఎంపీపీ గుగులోతు అరుణ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా మండలంలోని ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై చర్చించారు. ఐసీడీఎస్, విద్యుత్, హార్టికల్చర్, మిషన్ భగీరథ అధికారులతో ఆయా శాఖలపై సమీక్ష నిర్వహించారు. ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వీడి పరిష్కారానికి పాటు పడాలని అధికారులకు సూచించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ మండల అభివృద్ధికి పాటు పడాలని కోరారు. వేసవిలో తాగు నీటి ఎద్దడి లేకుండా మిషన్ భగీరథ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లోని ఎంపీటీసీలకు తగిన గౌరవం ఇవ్వాలని ఎమ్మెల్యే గ్రామస్థాయి అధికారులకు సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లో 42 మందికి కల్యాణ లక్ష్మి పథకం కింద చెక్కులు మంజూరు చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# షర్మిల పాదయాత్రలో మానుకోట నేతలు



గూడూరు: పాదయాత్రలో పాల్గొన్న అనిల్



నెల్లికుదురు: పాదయాత్రలో రామునాయక్

మహబూబాబాద్ రూరల్ : వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు షర్మిల వరంగల్ రూరల్ జిల్లాలో చేపట్టిన పాదయాత్రకు మానుకోట నుంచి వైఎస్సార్ టీపీ నేతలు గురువారం బయలుదేరి వెళ్లారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుగులోతు రాములునాయక్, పఠాన్, పట్టణ ముఖ్య నాయకులు మానుకోట నుంచి నర్సంపేటకు బయలుదేరి వెళ్లారు.

గూడూరు: నర్సంపేట డివిజన్ చెన్నరావుపేట మండలంలోని లింగగిరి, సూరిపల్లి, నెక్కొండలో గురువారం ప్రారంభమైన వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు షర్మిల ప్రజాప్రస్థానం పాదయాత్రలో వైఎస్సార్ టీపీ మండల కో ఆర్డినేటర్ బందెల అనిల్ పాల్గొన్నారు. నిరాహార దీక్ష విజయవంతం గూర్చి షర్మిల అనిల్‌ను ప్రత్యేకంగా అభినందించి, తన వెంట నడిపించినట్లు ఆయన తెలిపారు.

నెల్లికుదురు: కుట్రలు కుతంత్రాలు చేసి వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేస్తున్న ప్రజా ప్రస్థానం పాదయాత్రను కొంతమంది దుర్మార్గులు నిలిచిపోయేలా చేసిన ప్రాంతం నుంచే గురువారం ప్రారంభించినట్లు పార్టీ జిల్లా యూత్ అధ్యక్షుడు రామునాయక్ తెలిపారు. నర్సంపేట నియోజకవర్గం శంకరమ్మ తండాలో మొదలైన పాదయాత్రలో షర్మిలతో పాల్గొన్న రాము నాయక్ మాట్లాడుతూ ప్రజల పక్షాణ నిలిచి ప్రజల కష్టసుఖాలను తెలుసుకుని వారికి న్యాయ పోరాటం చేసేందుకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## పరామర్శ

గూడూరు : మండలంలోని గుండెంగలో బుధవారం రాత్రి జీపీ కో ఆప్షన్ సభ్యురాలు చీకటి కొమురమ్మ (56) గుండెనొప్పితో మృతిచెందింది. అదే విధంగా గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ కందిక స్వామి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ గురువారం ఉదయం బాధిత కుటుంబాలను పరామర్శించారు.ఆయన వెంట ఎంపీపీ బానోతు సుజాత, నాయకులు బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ బోడ కిషన్‌నాయక్ ఉన్నారు.

## చట్టాలపై అవగాహన

దంతాలపల్లి : మండల పోలీస్‌స్టేషన్‌లో 8 వతరగతి విద్యార్థులకు గురువారం ఎస్సై కూచిపూడి జగదీష్ చట్టాలపై న్యాయం అమలు తీరుపై అవగాహన కల్పించారు.ఉపాధ్యాయులు విద్యార్థులకు స్టేషన్‌కు తీసుకు రాగా ఎస్సై విద్యార్థులకు ఎఫ్ఐఆర్, బెయిల్ కేసుల ట్రయల్ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఏఎస్ఐ గోపీచంద్, పాల్గొన్నారు.

# పేదోళ్లను కొట్టి ధనవంతులకు పెడుతున్న ప్రభుత్వం

- ములుగు ఎమ్మెల్యే సీతక్క



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సీతక్క

గంగారం : కేంద్రంలో మతాల మధ్య చిచ్చుపెడుతూ బడుగు, బలహీన వర్గాలను తీవ్ర అన్యాయం చేస్తుందని, పేదలను కొట్టి ధనవంతులకు మేలు చేసే విధంగా నరేంద్రమోడీ ప్రభుత్వం ఉందని కాంగ్రెస్ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే సీతక్క విమర్శించారు. మండలంలోని పూనుగొండ్లలో కాంగ్రెస్ పార్టీ గంగారం, కొత్తగూడ మండలాల కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశాన్ని గురువారం నిర్వహించారు. తొలుత పూనుగొండ్లలోని పగిడిద్దరాజు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యే మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ఎనలేని కృషి చేసే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంక్షేమాన్ని విస్మరిస్తూ ఒకరిపై ఒకరు దూషనలు చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారని ఆరోపించారు. సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరుతూ ఎమ్మెల్యే సీతక్కకు వీఆర్ఏలు వినతిపత్రాన్ని సమర్పించారు. ఎమ్మెల్యే సీతక్కను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి, గంగారం ఇన్‌చార్జీ చల్లా నారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ, కొత్తగూడ ఇన్‌చార్జీ కందిమల్ల మధుసుధన్‌రెడ్డి, కాంగ్రెస మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, జిల్లా నాయకులు లావణ్యవెంకన్న, ఎంపీపీ బానోత్ విజయ రూప్‌సింగ్, సువర్ణపాక సరోజన, మాజీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీలు పులుసం పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

# సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద భక్తుల పూజలు



కురవి : తులిస్యా తండాలో భక్తుల మొక్కులు



కేసముద్రం : ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

కురవి/డోర్నకల్/గూడూరు/కేసముద్రం : మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద గురువారం భక్తులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు పూజారులతో కలిసి జాతరను సాంప్రదాయబద్ధంగా ప్రారంభించారు. గద్దెల వద్ద పసుపు, కుంకుమ, అడవి పూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేసముద్రం మండలంలోని ఉప్పరపల్లిలో లింగమంతుల జాతర వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. యాదవ కులస్తులు తమ ఇళ్ల నుంచి బోనాలను ఎత్తుకుని ఆలయానికి చేరుకుని, స్వామివారికి సమర్పించారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఎంపీపీ వోలం చంద్రమోహన్, జెడ్పిటీసీ శ్రీనాథ్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు నజీర్‌అహ్మద్, ప్రధాన కార్యదర్శి కముటం శ్రీనివాస్, నీలం దుర్గేష్, గుగులోతు వీరునాయక్, కుమార్ పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నెహ్రూసెంటర్ : దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు



నెల్లికుదురు: బడ్జెట్ పత్రాలను దహనం చేస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్/నెల్లికుదురు/చిన్నగూడూరు/కురవి/డోర్నకల్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రం, ఉమ్మడి వరంగల్ జిల్లాకు మొండిచేయి చూపారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.అజయ్‌సారధిరెడ్డి అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రాంమ్మూర్తి అన్నారు. నిధులు కేటాయించకుండా, విభజన హామీలను అమలుపై బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను సీపీఐ ఆధ్వర్యంలో గురువారం దహనం చేశారు. చిన్ననెల్లికుదురు లో కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దళిత నిరుపేదలకు ద్రోహం చేసిందని సీఐటీయూ మండల కార్యదర్శి ఇస్సంపల్లి సైదులు అన్నారు. గురువారం బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతు వ్యతిరేమని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వల్లూరి వెంకట్ రెడ్డి అన్నారు. కురవిలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దివ్యాంగులకు తీరని అన్యాయం చేశారని ఆరోపిస్తూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. సంఘం జిల్లాప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాజా మాట్లాడారు.

# బొడ్రాయి జీర్ణోద్ధరణ పూజలు

- నేడు జలాభిషేకం, ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు, చైర్మన్

మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలో వైభవోపేతంగా ప్రారంభమైన బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన పూజ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు గురువారం బొడ్రాయి జీర్ణోద్ధరణ (వెలికితీత) పూజలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్ద వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బైండ్ల పూజారుల ఆధ్వర్యంలో పాతబొడ్రాయి వద్ద శాస్త్రోక్తంగా జలాభిషేకంతో పూజా ద్రవ్యాలను సమర్పించి పూజలు చేశారు. జమిడిక నాదంతో ఆటలు, పాటలు, కథలతో భక్తులకు కనులవిందు గావిస్తూ దండకాలు చదువుతూ ప్రజల సమక్షంలో జీర్ణఉద్ధరణ కార్యక్రమం నిర్వహించారు.

**నేడు జలాభిషేకం, ప్రత్యేక పూజలు, యజ్ఞాలు**

బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన పూజల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి గోపూజ, విఘ్నేశ్వరపూజ, స్వస్తివాచనం, స్థలశుద్ధి, పంచగవ్య ప్రాసనపూజలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఆచార్యుల ఆధ్వర్యంలో రుత్విక్‌వరణం, అంకురారోపణం, మాతృకవాస్తు, యోగిని క్షేత్రపాలక నవగ్రహ మంటపారాధన, వాస్తుహోమం, పర్యగ్నికరణం, ప్రధాన మంటపారాధన, జలాభిషేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి స్థాపిత దేవతాహోమం, మూలమంత్ర జపాలు, కుంకుమ పూజలు, ప్రదోశపూజ, నిరాజన మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం, రుత్విక్ సన్మానం నిర్వహిస్తారని తెలిపారు. బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన కమిటీ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, డాక్టర్ సీతామహాలక్ష్మీ, పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

### పర్యటనను జయప్రదం చేయండి

గార్ల: మండలంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య పర్యటనను జయప్రదం చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గుండా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

### పాదయాత్రను జయప్రదం చేయండి



నెహ్రూసెంటర్ : కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలో ఇచ్చిన హామీల అమలుకై మార్చి 17 నుంచి ఏప్రిల్ 17 వరకు జరిగే లాంగ్ మార్చ్ (పాదయాత్ర)ను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి అన్నారు. సీపీఐ జిల్లా సమితి సమావేశం స్థానిక వీరభవన్‌లో గురువారం నిర్వహించారు. ప్రజలు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఐ శ్రేణులు ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

### పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



చిన్నగూడూరు: మన ఊరు... మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డీఈ విద్యాసాగర్ అధికారులకు సూచించారు. గురువారం స్థానిక ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో చేపడుతున్న పనులను పరిశీలించారు.

### ఆపరేషన్లు నిర్వహించాలి

మహబూబాబాద్ రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంలో అర్హులైన, అవసరం ఉన్నవారికి కంటి ఆపరేషన్లు నిర్వహించాలని వైస్ ఎంపీపీ ఎల్ది మల్లయ్య గౌడ్ అన్నారు. మండలంలోని ఆమనగల్‌లో గురువారం కంటి వెలుగు రెండో విడత కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

చిన్నగూడూరు: మండలంలోని జయ్యారంలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ పద్మ ప్రారంభించారు. ఆరు రోజుల పాటు శిబిరం కొనసాగుతుందన్నారు.

### ప్రమాద బాధితులను ఆదుకోవాలి

గూడూరు: ఏజెన్సీ మండలాల్లో వృత్తిరీత్యా ప్రమాదానికి గురై గాయపడిన కల్లుగీత కార్మికులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు యమగాని వెంకన్న, ఉపాధ్యక్షుడు పానుగంటి వీరస్వామిగౌడ్ కోరారు. మండలంలోని నాయకపల్లి, సీతానగరం గ్రామాల్లో ఇటీవల తాటిచెట్లు ఎక్కుతూ ప్రమాదానికి గురై గాయపడిన బాధితులను గురువారం పరామర్శించారు.

### విద్యార్థులు అన్నిరంగాల్లో ముందుండాలి

మహబూబాబాద్ అర్బన్ : విద్యార్థులు అన్నిరంగాల్లో ముందుండాలని ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ మేనేజర్ చల్ల రాము, డీఎం ఉపేందర్‌రెడ్డి అన్నారు. హోలి వర్స్ హై స్కూల్‌లో గురువారం ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ మహబూ బాబాద్ శాఖ పది సంవత్సరాల వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.

### వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్ : ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వీఆర్ఏలు తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఎమ్మెల్యే శంకర్ నాయక్ వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం నాయకులు భరత్‌కుమార్, శ్రీవాత్సవ్, విద్యాసాగర్ మాట్లాడుతూ వీఆర్ఏలకు పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి కేటీఆర్, సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### బెల్లయ్యనాయక్‌కు స్వాగతం



మహబూబాబాద్ రూరల్ : ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు జరిగిన పాదయాత్రలో పాల్గొని ఏఐసీసీ ఆదివాసి విభాగం జాతీయ వైస్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ తెలంగాణకు రావడంతో జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయనకు గురువారం శంషాబాద్ ఎయిర్ పోర్టులో ఘన స్వాగతం పలికారు. టీపీసీసీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గుగులోతు వెంకటినాయక్ ఆధ్వర్యంలో నెల్లికుదురు మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల గుట్టయ్య, జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, వెన్నమల్ల వెంకటస్వామి, తదితరులు స్వాగతం పలికారు.

### వీరన్న సన్నిధిలో చలువపందిళ్ల ఏర్పాటు



కురవి: స్థానిక భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో భక్తులకు నీడనిచ్చేందుకు ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు గురువారం ప్రధాన ఆలయ ప్రాంగణం, ఆలయ సత్రాలు, భద్రకాళీ ఆలయం ఆవరణలో చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. ఈనెల 17 నుంచి మహాశివరాత్రిని పురస్కరించుకుని వీరభద్రస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏర్పాట్లు ముందుగానే ప్రారంభించారు.

### ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలి



తొర్రూరు రూరల్: సమాజంలోని ప్రతి వ్యక్తి ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలని జగద్గురు గీతా ఆశ్రమ వ్యవస్థాపకులు జ్ఞాన చైతన్యానందస్వామి అన్నారు.. గురువారం మండలంలోని వెలికట్ట గ్రామ శివారులోని జగద్గురు గీతా ఆశ్రమ 18వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞాన చైతన్యానంద స్వామి మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని, భగద్గురు, పురాణాలపై నేటితరం అవగాహన పెంచుకోవాలని సూచించారు.

### మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

తొర్రూరు: విశ్వకర్మలకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలవడం అభినందనీయమని విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తంగళ్లపల్లి సోమయ్య తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ కౌశల్ యోజన పథకాన్ని ప్రవేశపెట్టడాన్ని హర్షిస్తూ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గురువారం అన్నారంరోడ్డులో ప్రధాని మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

### ప్రతి ఒక్కరూ సేవాగుణం కలిగి ఉండాలి

పెద్దవంగర : ప్రతి ఒక్కరూ సేవా గుణం కలిగి ఉండాలని హెచ్‌ఎం కలకోట్ల చిరంజీవి అన్నారు. గురువారం మండలంలోని అవుతాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ ఉపాధ్యాయురాలు ఎం.రజిత జన్మదిన సందర్భంగా రూ. 5 వేలు విలువ చేసే విద్యా సామాగ్రితో పాటు వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ సర్పంచ్ సల్లెండి మంజుల లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు దీప, సెక్రటరీ శైలజ, ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ డిపో అభివృద్ధికి కృషి

నెహ్రూసెంటర్ : మహబూబాబాద్ ఆర్టీసీ డిపో అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోను ఎమ్మెల్యే గురువారం పరిశీలించారు. ఆర్టీసీ ప్రాంగణంలో జరుగుతున్న సీసీ నిర్మాణ పనులు, అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# దళితులను మోసం చేసిన సీఎం కేసీఆర్



మాట్లాడుతున్న రవీందర్‌నాయక్

మహబూబాబాద్ అర్బన్ : ఎన్నికల సమయంలో తెలంగాణ రాష్ట్రంలో మొదటిసారిగా దళితుడిని సీఎం చేస్తానని చెప్పిన కేసీఆర్, మునుగోడు ఉప ఎన్నికల్లో గిరిజనబంధు పథకం అమలు చేస్తానని హామీ ఇచ్చి దళిత, గిరిజనులను మోసం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర నేత రవీందర్ నాయక్ అన్నారు. స్థానిక ఆర్‌ఎంబీ అతిథి గృహంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన హాజరై మాట్లాడుతూ. కాళేశ్వరం ప్రాజెక్ట్, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాల్లో ఇష్టారీతిన అవినీతి పాలడి సీఎం కేసీఆర్ ప్రపంచ స్థాయి అవినీతి పరుల్లో ప్రథమస్థానంలో నిలిచాడన్నారు. రామచంద్రర్ రావు, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, పాల్గొన్నారు.

# పగిలిన పైపులు..నిలిచిన తాగునీటి సరఫరా



డోర్నకల్ : మున్సిపాలిటి పరిధిలోని పలు ప్రాంతాల్లో తరచూ తాగునీటి సరఫరా నిలుస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురువారం సాయినగర్‌లోని బీఎస్ఎన్ఎల్ ఎక్స్చేంజీ ఎదురుగా వాటర్ ట్యాంక్ నుంచి యాదవ నగర్‌కు తాగునీటిని సరఫరా చేసే పైపు రెండు ప్రాంతాల్లో పగలడంతో యాదవనగర్‌లోని నాలుగు వీధుల్లో తాగునీటి సరఫరా నిలిచింది. పట్టణ సుందరీకరణలో భాగంగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి భూమిలోపల నుంచి కేబుల్ అమర్చి స్తంభాలకు విద్యుత్ సరఫరా చేసేందుకు రోడ్డు ప్రక్కన తవ్వకాలు చేపట్టారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పైపులు పగిలి నీరంతా వీధిలో ప్రవహించడంతో కాలనీలో బురదమయమైంది.